క్లుప్తంగా

మోడు తొలగించారు


మోడును తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బిక్కవోలు: స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ప్రమాద కరంగా ఉన్న మోడును సోమవారం తొలగించారు. మోడుతో పొంచి ఉన్న ముప్పు శీర్షికన సాక్షి పత్రికలో వచ్చిన వచ్చిన కథనానికి తహసీల్దార్ కృష్ణ స్పందించారు. ఆయన ఆదేశాల ప్రకారం సిబ్బంది దాన్ని తొలగించారు.

సాక్షి ఇంపాక్ట్

వీరభద్రస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

బిక్కవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసంలో శుద్ధ పంచమి పురస్కరించుకుని స్వామికి అభిషేకాలు, కల్యాణం జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం


పెదపూడిలో ఆకుకూరలు అందజేస్తున్న సూపర్ వైజర్ శ్రీపద్మ

పెదపూడి: పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. పెదపూడిలో సోమవారం పోషణ వాటికలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల వద్ద తయారు చేసిన ఆకుకూరలను తహసీల్దార్ సీతాపతిరావు, ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డిలకు కాకినాడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సంపర సెక్టార్ సూపర్ వైజర్ శ్రీపద్మ పంపిణీ చేశారు. వీటిని తల్లులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేయనున్నారు.

సచివాలయాల్లో నీటి పన్ను చెల్లించాలి

పెదపూడి: నీటి పన్నును గ్రామ సచివాలయాల్లో చెల్లించేలా సాంకేతిక వ్యవస్థను తీసుకురావడం జరిగిందని, రైతులు వెంటనే నీటి పన్నును చెల్లించాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. ఆయన సోమవారం పెదపూడిలో మాట్లాడుతూ రైతులు గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా డిమాండ్ నోటీసులు పొందు, వెంటనే నీటి పన్నును చెల్లించాలన్నారు. ప్రభుత్వం సాంకేతిక కారణాలను తొలగించి 2020 సంవత్సరానికి ముందు ఉన్న బకాయిలు నిర్ధారించి 2024 సంవత్సరం వరకు 1430 పసలీ నుంచి 1434 పసలీ వరకు నీటి పన్నును రైతులు చెల్లించాల్సి ఉందన్నారు. రైతులందరు గ్రామ సచివాలయాలను సందర్శించి సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌కు వ్యవసాయ భూములు వివరాలను తెలియజేసి పన్ను చెల్లించాలన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

రాజానగరం: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై మండలంలోని పాత తుంగపాడు, కొత్త తుంగపాడు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. జూలై 10న జరిగే గురు పౌర్ణమికి జగద్గురువుగా శ్రీకృష్ణుని మాత్రమే పూజించాలని, అందుకు గల కారణాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు శేఖర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రెండు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందాయి. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌కు రెండుసార్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా రాలేదంటూ చినకొండేపూడికి చెందిన సూరపురెడ్డి కృష్ణవేణి, రీసర్వేలో భూమి విస్తీర్ణం తక్కువ పడిందని, దాన్ని సరి చేయాలంటూ వంగలపూడికి చెందిన కె.శ్రీవల్లీ అర్జీలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

అదనపు షాక్..

- ప్రజలపై కూటమి విద్యుత్ భారం
- ఇప్పటికే చార్జీల మోత
- తాజాగా వీడీఎస్ పేరుతో చార్జీలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

రంగంపేట: విద్యుత్ చార్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచబోమని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై విద్యుత్ భారం మోపారు. చార్జీలను పెంచుకుంటూ పోతూనే.. అదనపు లోడ్ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నిత్య జీవితంలో విద్యుత్ ఓ భాగమైంది.. ఏ పనికైనా ఇది అత్యవసరమైంది. అలాంటి విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం పెంచి ప్రజల నడ్డి విరుస్తోంది. ప్రతి నెలా బిల్లులు చూసి షాక్‌కు గురవుతున్న వినియోగదారులను అదనపు లోడ్ పేరుతో విద్యుత్ శాఖ బాదేస్తోంది. పలు గృహ సర్వీసులకు వలంటరీ డిస్క్లోజర్ స్కీమ్ (వీడీఎస్) అంటూ మళ్లీ వడ్డిస్తోంది.

లోడ్ వెరిఫికేషన్ పేరుతో..

లోడ్ వెరిఫికేషన్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా నమోదు అవుతున్న కేసుల్లో పెరిగిన విద్యుత్ లోడ్ ఆధారంగా కిలోవాట్‌కు ఇంత అని చార్జీల మోత మోగిస్తుంది. ఇప్పటికే లోడ్ పెరిగితే కొందరు స్వచ్ఛందగా దరఖాస్తు చేసుకుని, విద్యుత్తు శాఖ విధించే వీడీఎస్‌ను విధిలేక చెల్లిస్తున్నారు. ఇది కాకుండా స్పెషల్ డ్రైవ్ పేరుతో అదనపు లోడ్‌లపై విద్యుత్ శాఖ దాడులు నిర్వహిస్తోంది. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా, నోటీసులు ఇవ్వకుండా ఇంటి కనెక్షన్లు తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే పెరిగిన విద్యుత్ చార్జీలతో ఇబ్బందులు పడుతుండగా.. ఇప్పుడు అదనపు లోడ్ పేరిట స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, కనెక్షన్లు తొలగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

కనెక్షన్ కట్

రంగంపేట మండలం మర్రిపూడిలో స్పెషల్ డ్రైవ్ పేరుతో ఓ ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను సిబ్బంది తొలగించారు. విద్యుత్ వాడకానికి కిలోవాట్ల కేటగిరీల వారీగా అడిషనల్ లోడ్ చార్జీ విధిస్తున్నారు. ఇలా కిలో వాట్‌కు రూ.1250 చెల్లించాల్సి వస్తోంది. ఇలా కిలోవాట్ల వారీగా చార్జీల భారం ఉంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది జరిమానా లాంటిదే. దీనికే వీడీఎస్ అని పేరు పెట్టి ఈ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే లోడ్ వెరిఫికేషన్‌లో ఏ వినియోగదారుడైనా కిలోవాట్ల గీత దాటితే వీడీఎస్ కింద రూ.1250 చొప్పున చెల్లించాలని తాకీదు వస్తోంది. మర్రిపూడికి చెందిన ఓ వినియోగదారుడికి 2024లో వీడీఎస్ కింద రూ.2300 కట్టాలని తాకీదు ఇచ్చారని దానికి తాజాగా వడ్డీతో కలిపి రూ.2900 చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని విద్యుత్తు సిబ్బంది నిలదీస్తున్నారు.


అదనపు లోడ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మర్రిపూడిలో విద్యుత్తు కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

ఇబ్బంది పెట్టడం సరికాదు

స్పెషల్ డ్రైవ్ పేరుతో విద్యుత్ సిబ్బంది ఒకేసారి ఇంటికి వచ్చి హడావుడి చేస్తున్నారు. దీంతో ఇంట్లోని వారు అదేదో దాడిలా కంగారు పడుతున్నారు. నా ఇంటికి అదనపు లోడ్ వినియోగించామంటూ సిబ్బంది వచ్చి ఉన్నపళంగా విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామన్నారు. ఇది సరికాదు. అడిషనల్ చార్జీల వసూలుకు ముందుగా నోటీలు ఇవ్వడంతో పాటు వినియోగదారులకు సవివరంగా వివరించాలి. గడువులోగా చార్జీలు చెల్లించమనాలి. ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు.

– వేము చిరంజీవి, మర్రిపూడి.

రాయితీ పథకం

విద్యుత్ వినియోగంలో అదనపు లోడు వాడుకుంటున్న వినియోగదారులకు ఏపీ ఈపీడీసీఎల్ రాయితీ పథకాన్ని అమలు చేస్తోంది. విద్యుత్ శాఖ ఇచ్చిన లోడ్ కన్నా అదనంగా వాడుకుంటే దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్‌పై అధిక భారం పడుతుంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, గృహోపకరణాలు పేలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమస్యను పరిష్కరించడానికి ఏపీ ఈపీడీసీఎల్ వినియోగదారుల కోసం క్రమబద్ధీకరణ రాయితీని అందిస్తుంది.

– తోట శిరీష, విద్యుత్ శాఖ ఏఈ, రంగంపేట మండలం

ధాన్యం బకాయిల కోసం నేడు పోరుబాట


మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ధాన్యాన్ని సేకరించిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి సొమ్ములను జమ చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం.. 48 రోజులు గడిచినా చెల్లించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రైతు సమస్యలపై తాము చేస్తున్న నిరంతర పోరాటంలో భాగంగా మంగళవారం బిక్కవోలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసి, రైతుల గోడు వివరిస్తామన్నారు. ధాన్యం బకాయిలతో పాటు రెండేళ్లకు సంబంధించిన అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు రూ.40 వేలు కూడా చెల్లించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బిక్కవోలు మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులందరూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు.

పోలీసు సిబ్బందికి సత్కారం


ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు విభాగంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు. విశ్రాంత జీవితం సంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్, ఏ.శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

కంబాలచెరువు: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఎస్పీ డి.నరసింహ కిశోర్ పరిశీలించారు. దీనిలో భాగంగా అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైయిజన్ (బందోబస్తు ప్రక్రియ) నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో బందోబస్తు పటిష్టంగా ఉండేలా, ఆయన తిరుగు ప్రయాణం అయ్యే వరకూ గట్టి భద్రత కల్పించాలని అధికారులను అప్రమత్తం చేశారు. భద్రతా చర్యలపై జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

ముస్లింలకు చంద్రబాబు ద్రోహం


సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న ఆరిఫ్

సీటీఆర్ఐ: వివాదాస్పద వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇచ్చి రాష్ట్రంలోని మైనార్టీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా ద్రోహం చేశారో ముస్లింలందరికీ వివరించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్, మాజీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారని వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ చైర్మన్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ ఆరిఫ్ అన్నారు. అలాగే వక్ఫ్ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో వ్యతిరేకించిన మాజీ సీఎం జగన్.. ముస్లింలకు చేసిన మేలును కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన రాష్ట్ర మైనార్టీ సెల్ విస్తత స్థాయి సమావేశంలో ఆరిఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.

హెచ్‌ఎం అమ్మిరెడ్డి సేవలు ఆదర్శనీయం


హెచ్‌ఎం అమ్మిరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

బిక్కవోలు: ఎందరో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దిన ఊలపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ తేతల సుమ అన్నారు. ఆయన స్వచ్ఛందగా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సోమవారం ఆ పాఠశాల వద్ద అమ్మిరెడ్డి, నాగశిరోమణి దంపతులను కుమార్తె మౌనిక, కుమారుడు అభిరామ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, ఎంపీపీ మాట్లాడుతూ శివకోడు, దొంతమూరు, పోలమూరు, కాలేరు, బలభద్రపురం, పందలపాక, మోళ్లూరు, కొంకుదురు, ఊలపల్లిలో 30 ఏళ్లగా అమ్మిరెడ్డి సేవలందించారన్నారు. ఇంకా ఏడేళ్ల సర్వీసు ఉండగా, ఆరోగ్య సహకరించక స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారన్నారు. సన్మాన గ్రహీత అమ్మిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్ర మైందని, తనకు ఈ ఉద్యోగం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలోని బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ బండారు శివ, తొస్సిపూడి మాజీ ఉప సర్పంచి తేతలి సూర్య చంద్రారెడ్డి, ఎంఈవో – 1 సీహెచ్‌సీ సత్యనారాయణ, మండపేట ఎంఈవో – 2 సీహెచ్‌వీ సోమిరెడ్డి, పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్ రెడ్డి, గోలుగూరి వెంకటరామారెడ్డి, వలిషా, జంగా ప్రసాద్, వైబీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత


కొంకుదురులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, వైద్య సిబ్బంది

బిక్కవోలు: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ బాధ్యత తీసుకోవాలని సర్పంచి సత్తి వీరమణి అన్నారు. కొంకుదురు పీహెచ్‌సీ వద్ద డాక్టర్లు జి.వి జయలక్ష్మి, జె.ఈశాజ్యోతి ఆధ్వర్యంలో సోమవారం క్షయ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేశారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆదిలోనే క్షయను నిర్ధారణ చేస్తే, చికిత్సతో నయం చేయవచ్చన్నారు. అనంతరం ఆ వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలోని సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, టీబీ సూపర్ వైజర్ బి.మహేష్‌బాబు, సీహెచ్‌వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈఈ శ్రీధర్ వర్మకు నివాళి


రంగంపేటలో శ్రీధర్ వర్మకు పుష్పాంజలి ఘటిస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగంపేట: ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర వర్మ అకాల మరణం కలచివేసిందని మండల విద్యుత్ శాఖ ఏఈ తోట శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్య కారణంతో శనివారం మృతి చెందిన శ్రీధర్ వర్మ సంతాప సభ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎల్ఐ ధర్మ, ఎల్ఎం ప్రసాద్, రామచంద్రరావు, అజయ్, జేఎల్ఎంఎస్, షిఫ్ట్ ఆపరేటర్స్ నరేష్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలి

బిక్కవోలు: గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బయ్యవరపు రాజేశ్వరరావు అన్నారు. బలభద్రపురంలో ఆదివారం రాత్రి ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఇతర అనుబంధ సంఘాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఫలాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు. జూలై ఏడున ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామల్లో దండోరా దిమ్మలను ఏర్పాటు చేసి దండోరా జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.